# పౌండ్రక వాసుదేవుడు


ఇక్కడ బలరాముడిలా ఉండగా కరూశదేశాధిపతి పౌండ్రక వాసుదేవుడు తన భటుడ్ని ఒకడ్ని పిలిచి— వాసుదేవుడు తానుండగా మరొక వాసుదేవుడుండానికి వీలులేదని కృష్ణుడికి సందేశం పంపించాడు. కృష్ణుడు పౌండ్రకుడి మదం అణుస్తానని ప్రతి సందేశం పంపించి, దండయాత్ర సాగించాడు. రెండు అక్షౌహిణుల సైన్యంతో ఎదిరించిన పౌండ్రకుడ్ని తన చక్రాయుధంతో తల తెగకొట్టాడు. పౌండ్రకుడ్ని చంపడమేకాదు అతడికి సహాయంగా మూడు అక్షౌహిణుల సేనతో వచ్చిన కాశీరాజు తలకూడా తెగగొట్టి విజయోత్సాహంతో ద్వారకకు తిరిగి వచ్చాడు. అయితే కాశీరాజు కొడుకు సుదక్షిణుడు పరమశివుణ్ణి మెప్పించి అభిచార హోమం చేస్తే అగ్ని నీ కోరిక తీరుస్తాడని వరం స్వీకరించి ఆ హోమం చేశాడు. హోమగుండం లోంచి కృత్య అనే కరాళభూతం పుట్టి ద్వారక మీదకు భయంకర అగ్నిశిఖలతో వచ్చిపడి హాహాకారాలెత్తించింది.

శ్రీకృష్ణుడికి సుదక్షుణుడి ప్రయత్నమంతా అర్థమైంది. ప్రజలకు ధైర్యం చెప్పి తన చక్రాయుధాన్ని 'కృత్య' మీద ప్రయోగించాడు. అది మరింత భయంకరంగా కృత్యను గెంటి కాశీచేరి సుదక్షుణుడిని, హోమం చేసే ఋత్విక్కుల్నీ కూడా దహించింది. అంతటితో ఆగక కాశీ నగరాన్ని ధ్వంసం చేసి మరీ వెనక్కు వచ్చింది.

పూర్వకాలంలో సుగ్రీవుడికి మంత్రయిన మైందుడికి ద్వివిదుడు సోదరుడు. ఇతడు కంసుడికి స్నేహితుడు. కృష్ణుడి మీదకోపంతో కృష్ణుడి పరిపాలన క్రింద ఉండే పురాలను, జన పదాలనూ దహించి, భవనాలు, వనాలు, చెరువులూ, దొరువులు, చెట్లు దొరికినంత వరకు ధ్వంసం చెయ్యడం మొదలుపెట్టి, వచ్చి వచ్చి బలరాముడ్ని రెచ్చగొట్టాడు. చీకాకు పెట్టాడు. రాళ్ళతో ద్వివిదుడు నాగలితో బలరాముడు పోరిపోరి చివరికి ముష్టి యుద్ధానికి దిగారు. చివరకు బలరాముడు ద్వివిదుడు మెడను తన బాహువులలో బిగించాడు. దానితో గుడ్లు వెలికివచ్చి నెత్తురు కక్కుకొని వాడు చచ్చాడు.

ఒకసారి కృష్ణుడికి జాంబవతి వల్ల కలిగిన సాంబుడు అనేవాడు దుర్యోధనుడి కూతురు లక్షణను పెళ్ళి చేసుకోదలచి సాహసంగా ఎత్తుకుపోయాడు. కౌరవ ముఖ్యులు కర్ణుడు, శల్యుడు, భూరిశ్రవసుడు, యజ్ఞకేతుడు, సుయోధనుడు మొదలైన వాళ్ళు వెంటపడ్డారు. వారిని చూసి నవ్వి ప్రచండమైన యుద్ధం చేశాడు. మహావీరులని పేరున్న కౌరవ ప్రముఖులు ఏమీ చేయలేక అందరూ ఒక్కసారిగా సాంబుడి రథాన్ని చుట్టుముట్టి ఏకాకిని నిరాయుధుడ్ని చేసి లక్షణతో సహా బంధించి తీసుకువెళ్ళారు. ఈ వార్త నారదుడి ద్వారా యాదవులకు తెలిసింది. అంతా ఉగ్రసేనుడి అనుమతి పొంది కౌరవుల సంగతి తేల్చాలనుకుంటుంటే బలరాముడు అడ్డు వచ్చి, మనం మనం చాలా కావాల్సిన వాళ్ళం. నయాన పని జరిగేలాగ చూద్దామని శాంతింపజేసి ఉద్ధవుడ్ని తీసుకుని స్వయంగా హస్తినాపురానికి వెళ్ళాడు. ఉద్ధవుడ్ని తన రాయబారిగా పంపి ఊరి బయట తోటలో ఉండిపోయాడు.

ఈ రాయబారం ఫలించలేదు. దుర్యోధనుడికి యాదవులమీద లోకువ అభిప్రాయం బలరాముడికి తెలిసివచ్చింది. యాదవులు కౌరవుల మీదకు దండెత్తకుండా ఆపినందుకు బలరాముడు కించపడ్డాడు. మరుక్షణం కోపం ముంచుకురాగా నాగలిని సాచి భూమిలోకి దిగవేసి హస్తినాపురం మొత్తాన్ని పెల్లగించి గంగలో తోసివేయడానికి సిద్ధమయ్యాడు



అనుకోని ఈ సంఘటనకు ఉలికిపడి కౌరవ ముఖ్యులు పరుగున వచ్చి బలరాముడ్ని శాంతింపజేశారు. లక్షణతో సహా సాంబుడిని ధన, కనక, వస్తు, వాహనాలిచ్చి అప్పగించారు. బలరాముడు కొడుకునీ, కోడల్నీ తీసుకుని ద్వారకకు వచ్చాడు.

ఒకసారి నారదుడికి ఒక సందేహం కలిగింది. నరకాసురుడి ఇంటినుండి తెచ్చిన పదహారువేల మంది స్త్రీలతో కృష్ణుడు కాపురం చెయ్యడం ఎలా సంభవం? అని బయలుదేరి ద్వారకలో వారి అందరి ఇళ్లకూవెళ్ళి ప్రతిచోటా కృష్ణుడుండటం గమనించాడు నారదుడు.

'ఆహా! హరి మహిమ తెలుసుకోవడం అసాధ్యం కదా!' అని తెప్పరిల్లి కృష్ణుడికి నమస్కారం చేసి తనదారిని వెళ్ళిపోయాడు.

కొన్నాళ్లకు ఒక బ్రాహ్మణుడు కృష్ణుడున్న కొలువుకూటానికివచ్చి, జరాసంధుడు చాలా దుర్మార్గంగా వ్యవహరిస్తున్నాడని తనకి మొక్కని బ్రాహ్మణుడ్ని ప్రతివాడినీ పట్టి బంధిస్తున్నాడనీ ఇప్పటికి ఇరవైవేలమంది ఇలా చెరసాలల్లో మగ్గుతున్నారని, మమ్మల్ని మా కుటుంబాలతో బంధుమిత్రులతో కలపగల సమర్థుడవు నువ్వు తప్ప ఇంకెవరూ లేరని దీనంగా విన్నవించుకున్నాడు. సరిగ్గా ఈ సమయంలో నారదుడువచ్చి పాండవులు రాజసూయయాగం చేస్తున్నారని చెప్పాడు. అక్కడికి వివిధ రాజవంశాల వారూకూడా వస్తారని చెప్పాడు.

కృష్ణుడు యాదవులలో జ్ఞాని అయిన ఉద్ధవుడితో మంతనాలు జరిపి, జరాసంధ వధకు భీముడ్ని ఉపయోగించటం మంచిదని గ్రహించి, పాండవ రాజసూయానికి వెళ్ళడానికి నిశ్చయించాడు.

అక్కడ పాండవులు కృష్ణుడి ఆలోచన ప్రకారం నడుచుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. రాజసూయానికి అవసరమైన విజయయాత్రలు వాళ్ళు చెయ్యవలసి ఉంది. భీముడు తూర్పు దిశకి, నకులుడు పడమటి దిశకి, అర్జునుడు ఉత్తర దిశకి, సహదేవుడు దక్షిణానికి తమ తమ పక్షాన నిలిచిన మిత్రరాజుల బలాలతో వెళ్ళి జైత్రయాత్రలు ముగించుకుని వచ్చారు. ఒక్క జరాసంధుడు తప్ప మిగిలినవారంతా కప్పాలు చెల్లించారని విని ధర్మరాజు ఊరుకున్నాడు గానీ కృష్ణుడు ఊరుకోలేదు.

తను, అర్జునుడు, భీముడు బ్రాహ్మణవేషాలతో బయలుదేరి వెళ్ళారు. భీముడ్ని, జరాసంధుడ్ని మల్లరంగంలోకి దించాడు కృష్ణుడు. తను కోరిన విధంగా జాగ్రత్తగా భీముడ్ని తన సూచనలతో నడిపించి, జరాసంధ వధ పూర్తి చేయించాడు. జరాసంధుడు బంధించిన వాళ్ళందరినీ వెంటనే చెరసాలల నుండి విడిపించాడు.

రాజసూయయాగం పరిసమాప్తి సందర్భం వచ్చింది. సభాధిపతి పూజకు కృష్ణుడ్ని ఎంచినందుకు శిశుపాలుడు మండిపడ్డాడు. కృష్ణుడ్ని నోటినిండుగా నిందించాడు. ఏమీ చలించకుండా శిశుపాలుడ్ని కృష్ణుడు తన చక్రాయుధంతో సంహరించాడు. రాజసూయానికి వచ్చిన దుర్యోధనుడు విచిత్రమైన మయసభ చూసి అసూయతో దహించుకుపోయాడు. దుర్యోధనుడు అవమానం పొం

దాడని తెలిసి కూడా ముందు జరగబోయేది ఎరగని వాడిలాగ కృష్ణుడు మాట్లాడక ఊరుకున్నాడు.

శిశుపాలుడికి సాల్వుడు అనే స్నేహితుడున్నాడు. రుక్మిణి పెళ్ళి సందర్భంగా కృష్ణుడి చేతిలో ఓడిపోయినవారిలో అతనొకడు. ఈ భూమిమీద యాదవుల్ని లేకుండా చెయ్యాలనే పట్టుదలతో శివుడ్ని గురించి తపస్సు చేశాడు. శివప్రసాదం వల్ల మయుడి ద్వారా 'సౌభకం' అనే మహత్తర విమానాన్ని సంపాదించాడు. వెంటనే ద్వారకా నగరం మీదకు తన సైన్యాలతో యుద్ధానికి వచ్చా



డు.

ప్రద్యుమ్నుడు నాయకుడుగా యాదవ వీరులంతా యుద్ధానికి సిద్ధమయ్యారు. పోరు భయంకరంగా జరుగుతోంది. గదుడు, సాంబుడు, సాత్యకి, చారుదేష్ణుడు, అక్రూరుడు, కృతవర్మ వంటి యోధులంతా ఇందులో పాల్గొన్నారు. ఇలా ఇరవై ఏడు రోజులు ప్రచండయుద్ధం జరిగింది. అప్పటికి ఇంద్రప్రస్థం నుండి కృష్ణుడు ద్వారక చేరుకుంటున్నాడు. దారుకా! శకునాలేమీ బాగాలేవు. శిశుపాలుని స్నేహితులు నేను లేనప్పుడు తమ మాయోపాయాలతో ద్వారకకు ముప్పు తేవచ్చు. రథం వేగంగా పోనీ' అన్నాడు.

ద్వారకకు చేరగానే కృష్ణుడికి పరిస్థితి అర్థమైపోయింది. తన రథాన్ని సాల్వుడి 'సౌభకం' దగ్గరగా పోనిమ్మని కృష్ణుడు సారథికి చెప్పాడు. కృష్ణుడ్ని చూడగానే యాదవ వీరులకు ప్రాణాలు లేచి వచ్చాయి.

సాల్వుడికి కృష్ణుడికి అతి భయంకరమైన యుద్ధం జరిగింది. చాలా కష్టంమీద సాల్వుడి మాయలన్నీ గడిచి సౌభకాన్ని పడగొట్టి— ఇంకా గదతో యుద్ధానికి చెయిచాచే సాల్వుడి చెయ్యి నరికేశాడు కృష్ణుడు. చిట్టచివరగా చక్రాయుధం కూడా ప్రయోగించి తల తెగకొట్టేశాడు.

ఒకపక్క సాల్వుడు— మరొకపక్క పౌండ్రక వాసుదేవుడు కృష్ణుడి చేతిలో చనిపోవడం భరించలేక శిశుపాలుడి మరొక స్నేహితుడు దంతవక్త్రుడు పెద్ద గద తీసుకుని ఎదుర్కోవడానికి వెళ్ళాడు. అప్పుడు ఆనందంగా కృష్ణుడే ఎదురువచ్చి రథందిగి అతన్ని ఎదుర్కొన్నాడు. వాడు వస్తూనే తల పగిలిపోయేలా కృష్ణుడ్ని గదతో మోదాడు. కృష్ణుడొక్కసారి గుక్కతిప్పుకుని తన గదతో వాడి రొమ్ముమీద ఒక్క పెట్టు పెట్టాడు. ఆ దెబ్బతో దంతవక్త్రుడు నేలమీదకి దొర్లి రక్తం కక్కుతూ చచ్చిపోయాడు. వెంటనే వాడి శరీరం నుండి సూక్ష్మతేజం పుట్టి కృష్ణుడిలో లీనమైంది. ఆ సమయంలో తన అన్నను చంపాడనే కోపంతో విదూరథుడు కృష్ణుడి మీదకి భయంకరమైన కత్తి దూసి వచ్చాడు. కృష్ణుడు వాడిని కూడా చక్రాయుధంతో అంతం చేశాడు. ఇలాగ సోదర సహితంగా శిశుపాలుడి కులం వాళ్ళను, సాల్వుడి కులం వాళ్ళనూ కృష్ణుడు చాలామందిని చంపాడు.

కొంతకాలం గడిచింది. పాండవులకీ, కౌరవులకీ ఘోరయుద్ధం జరగక తప్పదని తెలిశాక, బలరాముడు తీర్థయాత్రలకు వెళ్ళి ఎన్నో క్షేత్ర తీర్థ దైవతాలను చూశాడు.

తిరిగి వచ్చేసరికి కౌరవ పాండవ యుద్ధం ముగిసి చివరికి భీముడూ, దుర్యోధనుడూ గదా యుద్ధానికి తలపడుతున్నారు. వారిద్దరి బలా బలాలెరిగిన బలరాముడు వారింపబోయాడు గానీ, ప్రయోజనం లేకపోయింది. ఎలా కావలసింది అలా కాకమానదని నిశ్చయించుకుని అక్కడ నుండి బయలుదేరి ద్వారకకు వెళ్లాడు. మళ్ళీ బయలుదేరి నైమిశారణ్యాన్ని చేరుకున్నాడు. అక్కడ మునుల అంగీకారంతో ఒక యజ్ఞం చేసి, దాన ధర్మాలు కూడా చేసి బంధు జ్ఞాతి సహితంగా రేవతితో కూడా బలరాముడు యజ్ఞసమాప్తికి

ఇంద్రగంటి
శ్రీకాంత శర్మ

సూచకంగా చేయవలసిన అవభృథ స్నానం చేశాడు. అక్కడ నుండి బయలుదేరి ద్వారకచేరి శాంతంగా సుఖంగా జీవించసాగాడు.

కృష్ణుడికి భక్త రక్షణమనే సహజ గుణం వల్ల ఒకసారి తన చిన్ననాటి స్నేహితుడు కుచేలుడు చూడవస్తే ప్రేమతో అక్కున చేర్చుకుని పిడికెడు అటుకుల దానంతోనే తృప్తిపడి సకల సంపదలు ఇచ్చి మన్నించాడు. కుచేలుడు మాత్రం ఆ సంపదల బలంతో కళ్ళు మూసుకుపోకుండా, పరతత్త్వాన్ని మరిచిపోకుండా మోక్షం పొందాడు.

ఒకసారి గ్రహణ స్నానానికి వెళ్ళడం నెపంగా తన బంధుమిత్రులతో స్యమంతపంచకమనే పుణ్య తీర్థానికి వెళ్ళాడు. అక్కడ చాలా మంది బంధుమిత్రులను కలుసుకునే అవకాశం కలిగింది. వారికి ఆ జీవిత పరమార్థాన్ని బోధించాడు. ఆ తర్వాత అక్కడకు నారదుడు, వ్యాసుడు, కణ్వ

దు, గౌతముడు, చ్యవనుడు, గార్గ్యుడు, వసిష్ఠుడు, గాలవుడు, అంగిరసుడు, కశ్యపుడు, అసితుడు, సుకీర్తి, మార్కండేయుడు, అగస్త్యుడు, ఆంగిరుడు, యాజ్ఞవల్క్యుడు మొదలైన ఋషులు కృష్ణుడ్ని చూద్దామని వచ్చారు. వారందరినీ ఎంతో ప్రేమగా ఆహ్వానించి మన్ననలు చేసి ' మీ అందరి దర్శనం ఒకేసారి కలగడం అన్ని తీర్థాలనూ ఒకేసారి సేవించిన ఫలం దక్కినట్లుంది' అన్నాడు.

అప్పుడా ఋషులందరినీ యాజకులుగా ఏర్పరచి వసుదేవుడు స్యమంతపంచకం దగ్గరే తన పద్దెనిమిది భార్యలతో కలిసి దీక్ష పుచ్చుకుని యజ్ఞం చేసి అనేక దాన ధర్మాలు చేసి యజ్ఞ పరిసమాప్తితో అవభృథ స్నానం చేసి యాజకులను, బంధు మిత్రులను సంతోషపెట్టాడు. ఉగ్రసేనుడు, బలరాముడు, కృష్ణుడు తమను ఎంతో ప్రేమతో కోరగా అక్కడ కలిసిన నందుడూ, యశోదా మూడు నెలలపాటు వారితో ఉండిపోయారు. ఆ తర్వాత విడువలేక విడువలేక తమ గోపాలకులతో వ్రేపల్లెకు వెళ్ళిపోయారు. ఈ గ్రహణ స్నాన సందర్భం పాండవులు అరణ్యవాసం చేసిన కాలం నాటిది.

చాలా కాలం తర్వాత ఒకవర్షాకాలంలో దేవకీదేవి బలరామకృష్ణులను ఒక కోరిక కోరింది అది—

కంసుడు పూర్వం చంపివేసిన తన ఆరుగురు కొడుకులను తెచ్చి చూపించమని—

బలరామకృష్ణులిద్దరూ యోగ మాయాబలంతో ఏడు పాతాళ లోకాలలో ఒకటైన సుతలానికి వెళ్ళారు. అక్కడ ఇంద్రసేనుడనే రాక్షసుడు వారికెదురుపడ్డాడు. ఆహ్వానించి, సేవించి నావల్ల ఏ పని కావాలి? అని వారి నడిగాడు. ఆ మాటలకు సంతోషించి కృష్ణుడిలా అన్నాడు.

''పూర్వం మొదటి యుగంలో మరీచికి వర్ణ అనే స్త్రీవల్ల ఆరుగురు కొడుకులు పుట్టారు. వాళ్ళు ఒకనాడు బ్రహ్మదేవుడు తన కూతురి మీదనే మోహపడటం చూసి నవ్వారు. దానికి బ్రహ్మ కోపించి 'మీరు రాక్షస పుత్రులుగా పుట్టండి' అని శపించాడు. వాళ్ళు హిరణ్యకసిపుడికి పుట్టారు. వీళ్ళవల్ల స్వర్గవాసులకి నష్టమొస్తుందని యోగమాయాదేవి తెచ్చి దేవకి గర్భంలో ఉంచింది.

కంసుడు వరుసగా వాళ్ళను పుట్టినవాళ్ళని పుట్టినట్లే చంపేశాడు. ఆ బిడ్డలకోసం మా తల్లి మనస్సు చంపుకోలేక చూడాలని కోరగా తీసుకు వెళ్ళడానికి వచ్చాం. వాళ్ళను భూమి మీదకు తీసుకువెళ్ళి, మా తల్లి దుఃఖాన్ని పోగొడితే— వారికి శాపం తీరుతుంది. నా అనుగ్రహం వల్ల మంచి గతులు దక్కుతాయి''.

బలరామకృష్ణులు ఆ ఆరుగురు బిడ్డల్ని తెచ్చి చూపించగానే దేవకీదేవికి ప్రాణాలు పులకించిపోయాయి. ఆ బిడ్డలు ఆమె దగ్గర పాలు తాగారు. వారికి బ్రహ్మశాపం తీరి నిజస్వరూపాలతో కృష్ణుడికీ, తల్లిదండ్రులకూ మొక్కి తమ స్థానాలకు వెళ్ళిపోయారు.

దేవకికి ఇదంతా చిత్రంగా అనిపించింది. ఇది కేవలం శ్రీహరి మాయగాక మరొకటి కాదనిపించింది.

ఏనాటిది తన పెళ్ళి ఏనాటిది అశరీరవాణి హెచ్చరిక! ఏనాటిది కంస హింస! ఏనాటిది కృష్ణ జననం! అన్నీ పెద్ద కలలాగా అనిపించాయి.

మృత్యుభయంలో ప్రారంభమైన తన వైవాహిక జీవితం, మృత్యుంజయుడైన శ్రీహరి మహిమలు కళ్ళారా చూసే భాగ్యం వరకు నడిచింది. ఇంతకంటే ఇంకేం మోక్షం కావాలి?

శుకయోగీంద్రుడు ఒక్క క్షణం ఆగి తరువాత కథ చెప్పడానికా అన్నట్టు ధ్యానమగ్నుడయ్యాడు.

# శ్రీకృష్ణ లీలలు

—ముళ్ళపూడి

చెరసాల ద్వారపాలకులకు పసిపాప ఏడుపు కర్ణకఠోరంగా వినబడింది. దిగ్గున లేచారు. గదిలో చూశారు. దేవకీ దేవి పక్కలో పసిపాప!

ఏడుస్తున్నాడు.

అష్టమ గర్భం.

రాజుగారికి ప్రాణగండం!

యమదూత!

'మహారాజా' అంటూ కేకలు వేస్తూ పరుగెత్తారు.

** ** **

రథాశ్వాలు మోరలు పైకెత్తి ముంగాళ్ళు నేలకి తన్ని ఒక్కసారి విసురుగా పైకి లేచాయి.

భూ నభా అదిరేలా భీకరంగా ఘోష పెట్టాయి. కొరడా ఛెళ్ళుమంది.

రథం ముందుకు కదిలింది.

కంసుడు మహోగ్రదగ్రుడై రథం తోలుతున్నాడు.

ఉదయపు నీరెండలో అందంగా హాయిగా మేలుకుంటున్న మధుర రథచక్రాల ధాటికి అశ్వపద ఘోషకి అదరిపడసాగింది. వీధులలో కసు వూడ్చే చోట్ల కొద్దికొద్దిగా లేస్తున్న ధూళి సుడి గాలికి ఎడారిలో ఇసుకలా చెలరేగి విజృంభించింది.

పసిబిడ్డలూ, ఆవులూ, దూడలూ పుష్పలావికలూ నీళ్ళపాల కావిళ్ళవాళ్ళూ కకావికలై పరుగిడుతున్నారు. పాలూ నీరూ కూరలూ పళ్ళూ నేల మీద చెల్లాచెదురుగా పడిపోతున్నాయి.

రథంలో కంసరాజు రౌద్రావేశంలో వణికిపోతూ గుర్రాలను మళ్ళీ మళ్ళీ ఛెళ్ళు ఛెళ్ళున కొడుతున్నాడు. దేవకి చెరసాల ద్వారం పెద్ద చప్పుడుతో తెరుచుకుంది. పసిబిడ్డను చేతుల్లో పెట్టుకుని దంపతులిద్దరూ కంసుడికి ఎదురు వచ్చారు. కంసుడు కత్తి దూశాడు. చేయి చాచాడు.

'అన్నా ఇది ఆడపిల్ల! అశరీరవాణి మాట అసత్యం!'

కంసుడు కత్తిని దించి ఆశ్చర్యంగా చూశాడు.

'అష్టమ సంతానం పుట్టే పుత్రుడు గదా నీకు హాని చేసేది! కానీ ఇది పుత్రిక. దీన్ని చంపకు. ఈ ఒక్క బిడ్డ ప్రాణదానం చేసి నా పుత్రశోకాన్ని చల్లార్చు.

'దేవకీ ఇదంతా మోసం. ఆ దొంగ దేవుడు ఆడుతున్న కపటనాటకం. మొన్న ఏడవ బిడ్డ బదులు గర్భస్రావం. ఇవాళ కొడుకు కాకుండా కూతురు. ఇది నాటకం. ఆడా మగా నాకనవసరం. అష్టమ గర్భం అది నాశనమై తీరాలి తే' అంటూ ఆ బిడ్డను ఎడమచేత లాగి పైకెగరేసి కత్తి ఝుళిపించాడు.

కానీ ఆ బిడ్డ నేల వాలలేదు. అంతరిక్షంలో నిలబడిపోయింది.

దేవి. ఎనిమిది చేతులు, ఆయుధాలు, ఆభరణాలు, ఆమెను సేవించే దివిజకోటి.

కంసుడు నిర్విణ్ణుడై పోయాడు. నిస్తేజుడై పోయాడు. జీవచ్ఛవమై పోయాడు.

చేతిలో కత్తి జారి నేలమీదపడి ఆ నిశ్శబ్దంలో ఖణేల్ మని దీనంగా మోగింది.

'ఓరీ కంసుడా! నిన్ను చంపేవాడు ఇక్కడ లేడు. నీ ఊహకందని చోట నీకు దొరకని చోట పెరుగుతున్నాడు. నిన్ను చంపడానికి సిద్ధమవుతున్నాడు' అని అంతర్ధానం చెందింది.

కంసుడు చేష్టలు దక్కి అలాగే కొద్ది క్షణాలు శూన్యంగా చూస్తూ నిలబడిపోయాడు. ●